**స్త్రీని భోగ్యవస్తువుగా చూసే మగవాడుకూడా తన కుమార్తెను తలుచుకుంటే....?**

"నమస్కారం సార్" అంటూ అప్పుడే లోపలికొచ్చిన ఒక మెరుపు తీగను క్షణకాలం ఆశ్చర్యంగా చూసి-"కూర్చో" అన్నాడు కృష్ణమూర్తి.

అందంగా అప్పుడే కొన్న బిస్కెట్ పాకెట్ లా వున్న ఆ పిల్ల కూర్చోకుండా నుంచునే వుంది!

"కూర్చో" అన్నాడు మళ్ళా కృష్ణమూర్తి తలెత్తి ఆ దీపాన్ని చూస్తూ.

"ఫరవాలేదండి."

"నీ పేరు ?"

"మంజుల."

"బావుంది. బి. ఏ. చదివావ్ కదూ ?"

"అవునండి. ఈ వుద్యోగం నాకు తప్పకుండా మీ రిస్తారనే ఆశతోనే వొచ్చాను."

"అలా ఎందుకనుకున్నావ్ ?"

ఈ ప్రశ్నకు మంజుల మాట్లాడకుండా తలొంచుకుంది.

"నీ కంటే బాగా చదువుకున్నవారు ఈ ఇంటర్వ్యూకి వచ్చారు. వారిని కాదని నీకే ఇస్తానని ఎందు కనుకున్నావ్?....చెప్పు ఏం ఫర్లేదు." కృష్ణమూర్తి ఫైల్లో పేజీలు తిప్పుతూ అడిగాడు.

ఈసారి మంజుల తలెత్తి ఒకసారి కృష్ణమూర్తి కేసి చూసి—

"సార్! మీరు గనుక నాకీ వుద్యోగం యివ్వకపోతే. మేం బ్రతకడం చాలా కష్టం ఇంటికి పెద్దదాన్ని నేనే. నా తర్వాత ముగ్గురు చెల్లెళ్ళు వున్నారు. మాకు నాన్న లేకపోవడంవల్ల వేరే ఆధారం లేదు. ఒక రోజు తింటూ మరోరోజు పస్తు ఉంటూ...."

మంజుల కంఠంలో గూడు కట్టుకున్న బాధ!

కనుకొలకుల్లో కన్నీటి తెరలు.

"ఉద్యోగం కోసం నా దగ్గరకు వచ్చే ప్రతివారూ అనే మాటే ఇది. ఐ కాంట్ హెల్ప్ యూ!!"

"మీరలా అనకండి సార్! మీరే గనుక నాకీ వుద్యోగం యివ్వకపోతే...."




మంజుల మాట పూర్తి కాక మునుపే కృష్ణమూర్తి నవ్వి—

"నేనేం చెయ్యను? ఐనా, నీకే ఉద్యోగం యివ్వాలని ఎక్కడుంది?" అన్నాడు.

మంజుల మాట్లాడకుండా పమిట కొంగును వేలితో చుట్టుకుంటూ నుంచుండిపోయింది!

కృష్ణమూర్తి కొన్నిక్షణాలు మంజులను గమనించి- "ఇంటర్వ్యూ అయిపోయింది. ఇక నువ్వు వెళ్ళవచ్చును." అన్నాడు. అని కుర్చీలోంచి లేవబోతుండగా ఫోన్ మ్రోగింది.

ఫోన్ అందుకున్నాడు.

"నమస్కారమండి.... అవును....నేనే మాట్లాడుతున్నాను. అలాగే.... ఆ ఉద్యోగం మీకే తప్పకుండా వేయిస్తాను. ఇంకా ఇంటర్వ్యూలు అవలేదండి.... జరుగుతున్నాయి... అలాగే. సాయంత్రం మీకు తప్పకుండా ఫోన్ చేస్తాను. వుంటానండి" అంటూ ఫోన్ పెట్టేసి—

"నువ్వింకా వెళ్ళలేదా?" అన్నాడు.

"సార్! నన్ను కనికరించండి!"

"ఎలా కనికరించేది? అవతల స్వయంగా మంత్రిగారే ఫోన్ చేశారు విన్నావుగా. వున్న ఒక్క పోస్ట్ అయ్యగారి 'క్యాండిడేట్'కే కావాలట. ఇక, నేను చెయ్యగలిగిందేం లేదు."

"మీరలా అనకండి సార్! మీరు నాకీ వుద్యోగం యిచ్చారంటే జీవితాంతం మీకు ఋణపడి వుంటాను. మరేం చెయ్యమన్నా చేస్తాను."

'మీరేం చెయ్యమన్నా చేస్తాను.' అన్న మంజుల మాట కృష్ణమూర్తి గుండెల్లోకి సూటిగా తగిలింది.

అప్పుడు, కృష్ణమూర్తి ఆమె కళ్ళల్లోకి సూటిగా చూస్తూ—

"ఏం చెయ్యమన్నా చేస్తావా?" అన్నాడు.

"అవున్ సార్, తప్పకుండా చేస్తాను"

"అలా ఐతే నీకీ వుద్యోగం ఖాయం. ముందలా కూర్చో"



# ఇంటర్వ్యూ

నందం రామారావు

"థాంక్సండి" అన్నది మంజుల, ఇంకేం మాట్లాడాలో తెలియక.

"కూర్చొ ఫర్లేదు."

మంజుల కూర్చున్న తర్వాత కృష్ణ మూర్తి ఇలా అన్నాడు:

"చూడు మంజులా! నేను సాధారణంగా మాటివ్వను. మాటిచ్చానంటే ఖచ్చితంగా చేసినట్లే లెఖ్ఖ. నిన్ను చూడ్డంతోనే నీ అందానికి లొంగిపోయాను. నీలాటి సౌందర్యవతులు చాలా అరుదుగా తారస పడుతూ ఉంటారు. నువ్వు గనక నాతో ఈ రాత్రి గడపగలిగితే నీకే ఈ వుద్యోగం ఖచ్చితంగా వేసాను.... ఇందులో బలవంతం ఏమీ లేదు!!"

ఈ మాట వినగానే మంజుల కలవరపాటు చెందింది. ముఖంమీద పట్టిన చెమటను కర్చీఫ్‌తో తుడుచుకుంది. బలమైన ఆమె గుండెలు వేగంగా కొట్టుకోసాగాయి. ఏదో చెప్పాలని ప్రయత్నించి. చెప్పలేక. పైన తిరుగుతున్న పంకా కేసి చూస్తుండిపోయింది!

అక్కడనుంచి లేచి వెళ్ళిపోవాలనుకుంది. కానీ. అలా చేయలేకపోయింది!

ఇంటి పరిస్థితి.

తన ముగ్గురు చెల్లెళ్ళూ. తల్లీ. రెండు రోజులనుంచీ భోజనంలేక. ఎవరినీ అప్పు అడగలేక. ప్రేగులు మెలికలు తిరిగి పోతూవుంటే. గోడకానుకుని సొమ్మసిలి పోవడం అన్నీ మంజుల కళ్ళముందు మెదలడంతో కళ్ళు చెమ్మగిల్లాయి.

"చూడు మంజులా! నేనిలా మాట్లాడానని నువ్వు మరోలా భావించకు. నువ్వు బాధపడవలసిన అవసరం కూడాలేదు. నా అభిప్రాయాన్ని వున్నది వున్నట్లుగా చెప్పాను. అంతేగాని. నిన్నేదో మోసం చేసి నా అవసరం తీర్చుకున్న తర్వాత. నీకు వుద్యోగం యివ్వకుండా చేస్తానని మాత్రం అనుకోవద్దు. మరో విషయం—మనసంగతి ఎవరికీ తెలియదు. మనిద్దరిలోనే వుండిపోతుంది. ఇకపోతే. నీకు వుద్యోగం వచ్చిన తర్వాత నాతో కలవడం. కలవకపోవడం అనేది నీ ఇష్టం. లేదా. హాయిగా నీకు నచ్చిన కుర్రాణ్ణి పెళ్ళి చేసుకో."

కృష్ణమూర్తి ఇలా మనసు విప్పి మాట్లాడుతుంటే మంజులఆయన్ని అలాగే చూస్తుండిపోయింది!

ఒక చెడు భావాన్ని ఇంత అందంగా. తప్పును తప్పు కాదన్నట్లుగా చిత్రీకరించి

## వెదుకులాట

ఏమిటి వెదుకుతున్నాను
ఈ జీవితం అంచున !

గాలిలో భూమిపై గగనతలాన
పొగ మంచుగా చూపును విరోధించె
నీటి కణాల ఒత్తిడిలో
ఎక్కడా కనపడని
ఏ అనస్తిత్వాన్ని !

దిక్చక్రం మీద
చంద్రోదయానికి
విస్తృతమయిన మనస్సు
ఇసుక పరుపుమీది
వెన్నెల పొరల్ని చూచి
సన్నని జలదరింపు

ఈ ఇసుకా వెన్నెలా జీవితమూ
వేటికి ప్రతీకలు !
ఎవర్ని వెదుకుతూ ఇవన్నీ
నిరంతర క్షుభిత తరంగాలై

ఎగసి పడుతూ కుప్ప కూలుతూ
అగమ్యా గమన కాంక్షతో
అలసిపోతున్నాయి !

ఈ వ్యర్థాన్వేషణ
గుడుసులుచుట్టి తరగలై రేగి
వెన్నెల మంటలై
ఇసుక దుమారాలుగా
నా అస్తిత్వాన్నే వెక్కిరిస్తూ
ఏమిటీ ఏకత్వ సాధన !

మొన్న కన్ను మూసిన అమ్మ
ఎన్నడో కరిగి
కాలనాళంలో
ఉత్తేజంగా మారిన నాన్న

ఎందరో తల్లులూ తండ్రులూ
మరెందరో తమ్ముళ్ళూ నేస్తాలూ
నిద్రలో వ్యాపించే
కలవరింపుల ఛాయలై
గాలిలో కదిలే ఆకుల నీడలుగా
నన్ను పిలుస్తూ
వెనక్కి నెట్టేస్తూ
నా ప్రాణానికి
అదో విచిత్ర డోలాక్రీడ !

ఊరట కలగని మనస్సుతో
ఎంత ఆక్రోశించినా
ఏ అస్తిత్వాన్ని పట్టుకోగలను
ఏ రూపాన్ని చూపను
ఏ ఆంతర్యాన్ని
సొంతం చేసుకుని హత్తుకోగలను !

ఈ దిగులు నీడలు పేర్చే
చిక్కని చీకటిలో
చావుబ్రతుకుల మధ్య గీచిన
స్పష్టాస్పష్ట రేఖావలంబినై

ఎంతకాలం ఇలా
ఇలాతలం మీద
వెదుకులాడుతూ
ఉండగలను!

—వాయుని కృష్ణకుమారి

---

మాట్లాడుతూ, బ్రతకడానికి దారి చూపిస్తున్నట్లున్న కృష్ణమూర్తి మాటల్లోని విజాయితీకి విస్తుపోయింది మంజుల !

"మంజులా ! ఒక్క నిజం చెబుతున్నాను విను. మంచీ, చెడూ అనేది ప్రతి మనిషికీ తెలుసు. ఐనా, తెలిసి మనిషి ఏదో ఒక రకంగా తప్పు చేస్తూనే వుంటాడు. ఏదో ఒక బలహీనత మనిషిని ఎప్పుడూ శాసిస్తూనే వుంటుంది నిన్నేదో బలాత్కారంగా లొంగదీసుకోవాలనే అభిప్రాయం నాకు లేదు. యస్.ఆర్ నో. ఏదో ఒక్కటి చెప్పు చాలు. అవతల నాకు చాలా పనులున్నాయ్. కానీ, ఒక్కటి మాత్రం నిజం. నామీద నమ్మకం వుంచేనే రా. ఓకే ?" కృష్ణమూర్తి బజర్ నొక్కాడు.

కొన్ని సెకండ్లలో ప్యూన్ వచ్చి నించున్నాడు. "చూడు రాఘవయ్యా ! ఇంటర్వ్యూకొచ్చినవారు ఇంకెంతమంది వున్నారు ?"

"పదకొండుమంది వున్నారయ్యా."

"త్వరగా ఒక్కొక్కర్నే పంపించు. చూడూ ! ఈ అమ్మాయిని ఆ ప్రక్కగదిలో కూర్చో బెట్టి, 'టీ' తీసుకొచ్చియివ్వు. మంజులా ! నువ్వు ప్యూన్‌తో వెళ్ళి ఆ గదిలో కూర్చో. నేనీ లోపల ఇంటర్వ్యూలు పూర్తి చేసి వస్తాను." అంటూ కృష్ణమూర్తి ఏవో కాయితాలు చూసుకోసాగాడు.

మంజుల లేచి ప్యూన్‌ను అనుసరించింది.

కృష్ణమూర్తి పనులన్నీ చకచకా పూర్తి చేసి ఇంటికి ఫోన్ చేశాడు—

"చూడు కమలా ! ఈ రాత్రికి నేను ఇంటికి రాను. ఆఫీసుకి ఇన్‌స్పెక్షన్ ఆఫీసరు వొచ్చారు. వారితో పాటు నేనూ హోటల్ బ్లూడైమండ్‌లో వుంటాను. రూమ్ నెంబరు మూడువందల ఒక్కటి. ఏదైనా అవసరం వస్తే అక్కడికి ఫోన్ చెయ్యి" అని భార్యకు ఫోన్ చేసి పెట్టేశాడు.

* * *

హోటల్ బ్లూడైమండ్ ముందు కారు ఆగింది.

ఆ కారులోంచి కృష్ణమూర్తి ముందుగా దిగి, బెరుగ్గా కూర్చున్న మంజులను, ఏం ఫరవా లేదన్నట్టుగా చూసి ముందుకు దారి తీశాడు.

మంజుల, కృష్ణమూర్తిని అనుసరించింది.

నెంబరు మూడువందల ఒక్కటి గది చాలా చలగా వుంది. విశాలంగానూ వుంది. అందమైన డిజైన్సులో వున్న కర్టెన్లు ఒక ప్రక్కగా వ్రేలాడుతున్నాయి. గోడలకు ఆయిల్ పెయింటింగ్స్ బిగించబడివున్నాయి. ఒక ప్రక్కగా డ్రెస్సింగ్ టేబుల్, దానికి అమర్చేవున్న రేడియో. ఓ‌ట్లాస్ క్రిష్టల్ మరీ చలగా వుంది.

కృష్ణమూర్తి బెల్ నొక్కగానే బేరర్ వచ్చి నుంచున్నాడు.

"మంజులా ! నువ్వేం తీసుకుంటావ్ ?" అని అడిగాడు.

మెత్తని కుర్చీలో కూర్చున్న మంజుల, "మీ యిష్టం" అన్నది

కృష్ణమూర్తి చెప్పాడు.

బేరర్ వెళ్ళగానే మరో బేరర్ రెండు టర్కీటవల్స్, సోపూ, ప్లాస్కుతో ఐస్ వాటర్ తీసుకొచ్చి టేబుల్‌మీద పెట్టి వెళ్ళిపోయాడు.

"మంజులా ! నువ్వలా వుండడం నాకేం బావుండలేదు. చూడు ఈ రూమ్ బావుంది కదూ ?" అన్నాడు.

మంజుల నెమ్మదిగా తలెత్తి చుట్టూ చూసింది. హోటల్ గదులు ఇంత గొప్పగా వుంటాయని ఆమెకు తెలియదు

ఇప్పుడు ఎలా నసులుకోవాలో. ఎలా వుండాలో ఏంచెయ్యాలో అని మాత్రమే ఆలోచిసోంది!

తినవలసిన ఐటమ్స్ వచ్చాయి.

"నువ్వు బాత్‌రూమ్‌లో కెళ్ళాలంటే వెళ్ళు. ఇదిగో ఆ తలుపు తీసుకెళ్ళు"

అక్కర్లేదన్నట్టుగా తల అడ్డంగా తిప్పింది. కృష్ణమూర్తి. మంజుల ప్రక్కనే కూర్చుని. టేబుల్‌ను ముందుకు జరిపి ప్లేట్‌లో వున్న స్వీట్‌ను కొంచెంగా విరిచి చేత్తోతీసి. మంజుల నోటిదగ్గర పెట్ట బోయాడు.

మంజుల వారించి—

"నేను తింటాను. మీరక్కడపెట్టండి." అంది.

"ఐతే తీసుకో" అంటూ ఆ స్వీట్ ముక్కను ప్లేట్‌లోపెట్టి తను వేరొకటి తీసుకుంటున్నాడు.

"మంజులా! నువ్వేం మాట్లాడక పోవడం బావుండలేదు. నువ్వు మాట్లాడక పోవడంతో గదికే అందం పోయింది."

ఈ మాటకుమంజుల చిన్నగా నవ్వింది.

దాదాపు గంట గడిచి పోయింది.

ఈ గంట లోపల మంజులకు కృష్ణ మూర్తి మీద నమ్మకమే కలిగింది.

చనువుగా మాటాడ సాగింది.

"ఏమండీ? ఈ గది ఎంత వుంటుం దండీ?"

"రోజుకి వంద రూపాయలు."

"వందా?" ఆ పైన మాట పెగల్లేదు మంజులకు.

ఆ వంద రూపాయలు పెడితే నెలరోజు లకు బియ్యం వస్తాయి!

"మంజులా! ఇందాక నువ్వు ఆఫీసులో మీ కుటుంబం గురించి చెప్పిందంతా నిజ మేనా?"

ఈ మాట వినడంతోనే మంజుల అదోలా ఐపోయింది!

"నే నడిగినదానికి మాట్లాడవేం మంజులా."

"అబద్ధం ఆడవలసిన అవసరం నాకు లేదు. నా అవసరమే నన్నిక్కడికి తీసు కొచ్చింది"

"అయామ్ సారీ మంజులా! నేనీకు మాటిచ్చాను. ఆ మాట నిలబెట్టు కుంటాను."

"ఒక వేళ. మీకు ఏ మంత్రిగారి నుంచైనా హామీ లిడివస్తే..."

ఆ మాటకి కృష్ణమూర్తి నవ్వి—

"మంజులా నేనెవరో తెలియని నా దగ్గ రకు. నేను సహాయం చేస్తానని నమ్మి నాతో వచ్చావ్- అవునా? అటువంటి నీకు అన్యా యం చెయ్యడం అంటూ జరగదు. నీకో దారి తప్పకుండా చూపిస్తాను."

కృష్ణమూర్తి ఈ మాటలు చెబుతూనే మంజుల మెత్తని చేతుల్ని గట్టిగా పట్టు కుని. చాలా దగ్గరకు తీసుకున్నాడు. చేతుల్నీ. వీపును నిమురుతూ. కాళ్ళతో మంజుల కాళ్ళను తొక్కసాగాడు

ఇందతా మంజులకు చాలా కొత్తగా వింతగా వుంది.

వద్దని చెప్పాలని వున్నా-

చెప్పాలనిపించడంలేదు.

ఏదోలోగా....

ఎలాగో....

ఏవిటేవిటోగా వుంది!

సరిగ్గా—

అప్పుడే. ఆ సమయంలోనే ఫోన్ మోగింది.

ఇద్దరూ దగ్గరగా, ఇంకా దగ్గరగా

అన్నీ మరచి....


ఫోన్ ఇంకా మ్రోగుతూనే వుంది.



కృష్ణవేణీ పుష్కరాలు (శ్రీశైలంలో పాతాళగంగ)

చిత్రం: మారేమండ శ్రీనివాసరావు. శ్రీశైలం

# ప్రముఖులతో ప్రమోదాలు



## పరమ రహస్యం

ఐయిన్ స్టయిన్ రెండో భార్య ఎల్సాకు భర్తపట్ల ఎంతో ఆదరణ. ఒకసారి అయిన్ సయిన్ భోజనం చేస్తుండగా, భర్తతో, "మీ రెంతో మేధావులని మీరు చేసే పరిశోధనల గురించి చెప్పమనీ నన్ను అడుగుతుంటారు. కానీ నాకేం తెలియదని చెప్పవలసివస్తోంది. కొంచెం నాక్కూడా మీ కృషి గురించి చెప్పరూ' అంది గోముగా.

అంతా విన్న అయిన్ స్టయిన్ "ఓస్ యింతేకదా! ఈసారెవరన్నా అడిగితే నా కంతా తెల్సు. కానీ, అది పరమ రహస్యం. చెప్పకూడదు" అని చెప్ప మన్నాడు.

## విషయ పరిజ్ఞానం

మరొకసారి "సైంటిఫిక్ అమెరికన్" పత్రిక "సాపేక్షతగూర్చి 3000 మాటల్లో చక్కగా నిర్వచించిన వారికి రెండువేల పౌన్ల బహుమానం యివ్వబడును" అని ప్రకటించింది. ఆ ప్రకటన మిత్రులు అయిన్ స్టయిన్ కి చూపించారు. అంతా చదివిన అయిన్ స్టయిన్ పెదవి విరిచి "నేనొక్కడినే ఆ పని చెయ్యలేనివాడిని" అని జవాబిచ్చాడు.

## అంతా మాయ

అయితే అయిన్ స్టయిన్ ను యిదేరకం ప్రశ్న 1921లొ పత్రికా విలేకరులు కొన్ని మాటల్లో సాపేక్షత గూర్చి చెబుతారా అని అడిగితే ఆయనిలా చెప్పారు:

"నే నిచ్చే జవాబు సీరియస్ గా తీసుకోనంటే. ఒక జోక్ గా భావిస్తానంటే చెప్తాను. ఒకప్పుడు ప్రపంచంలో పదార్థం, వస్తువులు అంతా మాయమయిపోతే, కాలం, ఆకాశంమాత్రమే మిగులుతాయని నమ్మేవారు అయితే సాపేక్షతా సిద్ధాంతం ప్రకారం వస్తువులతోబాటే కాలం,ఆకాశం కూడా మాయమవుతాయి మరి!

## బాగున్నారా?

ఒకసారి అయిన్ స్టయిన్ కి జ్వరం వచ్చింది. డాక్టరు మందుబిళ్ళలు, ద్రవ రూపంలో మందూ రెండూ తీసుకువెళ్లారు. అయిన్ స్టయిన్ బిళ్ళలకన్నా డ్రాప్పే నయమని కొన్ని చుక్కలు గ్లాసులో వేసుకుని చప్పరించాడు. ఆ తరువాత కొంచెం యిబ్బందిగా వుండడంతో దొక్కున్నాడు. వెంటనే డాక్టరు కేసి తిరిగి "యిప్పుడు మీకు సంతృప్తిగా బాగుందా!" అని చమత్కరించాడు. దానికి డాక్టరు ముందు తెల్లబోయి తర్వాత నవ్వుకున్నాడు.

## ముఖే ముఖే సరస్వతి

అయిన్ స్టయిన్ వుంటున్న ఇంటి నెంబరు 112. ఆయన యిల్లు ప్రిన్స్టన్ లో వుంది. ఆయనింటికి తరచు పదేళ్ళ అమ్మాయి వెళ్తూ, వస్తూ వుండేది. ఒకసారి ఆ పిల్ల తల్లికి తన కూతురు వెళ్తున్న యిల్లు ప్రపంచ ప్రఖ్యాత విజ్ఞాన వేత్త అయిన్ స్టయిన్ దని తెల్సి, తన కూతురిని ఆ యింటికెందు కెళ్తున్నట్లని ప్రశ్నించింది. తనకు లెక్కలు అర్థం కావడంలేదని. ఆ ఇంట్లో లెక్కలు చెప్పే ఆయన వున్నారని తెల్సి వెళ్తున్నానని అంది. వెంటనే ఆ చిన్నారి తల్లి అయిన్ స్టయిన్ వద్దకు వెళ్ళి క్షమించవలసిందిగా కోరింది. అంతా విన్న అయిన్ స్టయిన్ నవ్వుతూ "అమ్మా మీ అమ్మాయికి తెలియని లెక్కలు తెలియచెపుతున్నాను. కానీ మీ అమ్మాయితో మాట్లాడడం ద్వారా నేనింకెన్నో విషయాలు నేర్చుకుంటున్నాను" అని సమాధానం చెప్పాడు.

— జె. ఎస్.

తప్పదు. ఫోన్ ఎత్తాలి.

కృష్ణమూర్తి విసుగ్గా యూఫోమ్ బెడ్ మీద నుంచి లేచి వెళ్ళి ఫోన్ అందుకున్నాడు.

అవతలనుంచి ఫోన్ లో యెవరో మాటాడుతున్నారు.

ఎవరు మాట్లాడుతున్నారో మంజులకు తెలియలేదు

ఈ లోపల ఆమె బాత్ రూమ్ లో కెళ్ళింది

కృషమూర్తి ఫోన్లో మాట్లాడం ఐపోయిన తర్వాత, టేబుల్ దగ్గర కెళ్ళి ఫ్లాస్కులో వున్న ఐస్ వాటర్ గ్లాసులోకి వొంపుకుని గడగడా తాగేశాడు. కర్చీఫ్ తో ముఖం తుడుచుకున్నాడు. చేత్తో జుట్టు సవరించుకున్నాడు. ఎదురుగా నిలువుపాటి బెల్జియం అద్దంలో తను కనిపిస్తున్నాడు. ఆ అద్దంలో తనను తాను చూసుకోవడం ఇష్టంలేక ఇవతలకు జరిగి కూర్చున్నాడు!

ఫోన్లో మాట్లాడి ఇవతలకు వచ్చిన దగ్గరనుంచీ కృష్ణమూర్తిలో వచ్చిన మార్పును గమనించిన మంజుల బెడ్ మీద నుంచి లేచి, కృష్ణమూరి దగ్గరకెళ్ళి—

"అదేవిటలా వున్నారు?" అంది.

"ఏం లేదు" అన్నాడు కృష్ణమూర్తి నవ్వుతూ.

"ఏమీ లేనిదే మరెందుకలా వున్నారు? ఆ వుద్యోగం కోసం ఎవరైనా ఫోన్ చేశారా?"

కృష్ణమూర్తి మాట్లాడకుండా మంజుల చేతిని నిమరసాగాడు.

"నా గురించి మీరు ఇబ్బందులు పడకండి." అని అంటూ మంజుల కృష్ణమూర్తి జుట్టులోకి వేళ్ళు పోనిచ్చింది.

కృష్ణమూర్తి తలెత్తి మంజుల ముఖంలోకి చూశాడు.

ఆమె ముఖంలో ఇదీ అని చెప్పలేని ఏదో భయం, దిగులూ, ఆందోళనా కనిపిస్తోంది. బహుశా, 'ఈ వుద్యోగం తనకి రాకపోతే ఇప్పుడెలా?' అనే ఆలోచన కావచ్చు!

మంజుల కృష్ణమూర్తి చేతిని పుచ్చుకుని నించోబెట్టి బెడ్ దగ్గరకు తీసుకెళ్ళింది.

అప్పటికి టైమ్ దాదాపు ఎనిమిది గంటలు దాటింది.

గదిలో వెలుగుతున్న పెద్ద లైటును తీసేసి చిన్న లైటు వేసింది మంజుల.

"మీరెందుకో చాలా పరధ్యానంగా వున్నారు?"

"అదేం లేదుగానీ... ఈ చీరలో నువ్వు చాలా బావున్నావ్?" అంటూ మంజుల

నుదుటిమీదపడిన ముంగురులను సవరిస్తూ అన్నాడు.

గంటక్రితం కృష్ణమూర్తిలో కనిపించిన వేడి యిప్పుడంతగా కనబడకపోవడం వల్ల-

"నా వల్ల మీకేదైనా ఇబ్బంది కలిగితే నన్ను క్షమించండి. మీ కిష్టమైన విధంగా నడుచుకోవడంలేదని...." మంజుల మాట పూర్తి కాకమునుపే కృష్ణమూర్తి ఆమె నోటికి చేతిని అడ్డుపెట్టి—

"ఇప్పుడేమైందని?" అన్నాడు.

"మిమ్మల్ని చూస్తుంటే నాకేదో భయంగా వుంది."


"అది నీ ఊహ మాత్రమే. అవునూ ఈ రాత్రి నువ్వు నాతోనే వుంటున్నావు కదూ? మీ ఇంట్లో ఏమీ అనరా?"

"స్నేహితురాలింట్లో పడుకున్నానని చెబుతాను."

కృష్ణమూర్తి నెమ్మదిగా మంజుల చేతిని తన చేతిలోకి తీసుకుని, మరో చేతిని ఆమె వీపుమీద వేసి గగ్గరకు లాక్కున్నాడు.

కృష్ణమూర్తికి యెక్కడ కోపం వస్తుందో, వచ్చిన ఈ అవకాశం యెక్కడ జారిపోతుందోనని బెదురుతూ మంజుల కృష్ణమూర్తికి మరింత దగ్గరగా జరిగింది.

కృష్ణమూర్తిస్పర్శ మంజులకు వెచ్చగా




వుంది. మత్తుగానూవుంది. కళ్ళు మూసుకుపోతున్నాయి.

గాలీ, వర్షం, వురుములూ, మెరుపులూ లేకుండానే ఆ గదిలో పిడుగుపడినట్టుగా- ఫోన్ ఖంగున మోగింది!

కృష్ణమూర్తి వులిక్కిపడి, దిగ్గున ఆ మెత్తని పరుపుమీదనుంచి లేవబోయాడు.

కృష్ణమూర్తి కోరిక తీరకముందే, ఈ క్షణం జారిపోతే మళ్ళీ ఈ మహత్తరమైన అవకాశం రాదేమోనని భయపడిపోతూ మంజుల కృష్ణమూర్తిని గట్టిగా పట్టుకుంది.

ఐనా, కృష్ణమూర్తి మంజులను విసురుగా విదిలించుకుని ఫోన్‌దగ్గరకు పరుగెత్తాడు.

"నేను కమలను మాట్లాడుతున్నానండి. మన మ్మాయి ప్రొద్దుననగా కాలేజీకని వెళ్ళి, తొమ్మిది దాటుతున్నా ఇంతవరకూ ఇంటికి రాలేదు. నాకేమోభయంగా వుంది."

"కమలా! నువ్వేం కంగారుపడకు. ఫ్రెండ్సింటికి వెళ్ళి వుంటుంది."



"లేదండి అమ్మాయి స్నేహితురాళ్ళందరింటికీ పంపాను. రాలేదని చెప్పారు. ఇక్కడ నా కొక్కతికే భయంగా వుంది. మీరు వెంటనే రండి."

"ఇదిగో ఇప్పుడే బయలుదేరి వస్తున్నాను." కృష్ణమూర్తి ఫోన్ పెట్టేశాడు.

ముఖం మీద పట్టిన చెమటను టవల్‌తో తుడుచుకున్నాడు. ఇంతక్రితం వరకూ వున్న వుత్సాహం పూర్తిగా హరించుకుపోయింది. మనిషి నిలువునా కంగారుపడసాగాడు. గబగబా బట్టలు వేసుకోసాగాడు.

కృష్ణమూర్తిలో వచ్చిన మార్పుకు కారణం యేవిటో పూర్తిగా తెలియని మంజుల ఆయన దగ్గరకెళ్ళి చేతులు పుచ్చుకుంది.

కృషమూర్తి తలెత్తి మంజుల కేసి చూశాడు.

ఇరవై యేళ్ళ అందమైన మంజుల.

ఉద్యోగం కోసం, తనకిష్టం లేక పోయినా పతనమవడానికి సిద్ధపడింది!

తన కూతురు కున్న వయస్సు మంజులకుంది. కూతురులాంటి మంజులను తను, వయస్సు పైబడుతున్న తను, తన అవసరానికి వుపయోగించు కోవాలను కున్నాడు!

అవతల, ఇంటిదగ్గర తన కూతురు ఇంటికి రాలేదని కనుల భయపడుతూ, ఆందోళన చెందుతూంది!

పాపం! మంజుల కోసం, ఆమె తల్లిదండ్రులు ఎంత ఆరాటపడుతున్నారో?

కృష్ణమూర్తి, మంజుల ముఖంలోకి చూడలేక చేతిని విడిపించుకుని—

"సారీ మంజులా! నేనర్జెంటుగా ఇంటికెళ్ళాలి. రేపు పదిగంటలకు ఆఫీసుకు వొచ్చి, నువ్వు ఆఫీసులో జాయిన్ కావడానికి ఆర్డరు కాయితం తీసుకెళ్ళు" అన్నాడు.

ఈ మాటను మంజుల నమ్మలేక, ఆశ్చర్య పోతూ— "మరి, మరి ..." అన్నది.

"అది మరచిపో మంజులా! నీకు ఉద్యోగం ఖాయం. రేపు పది గంటలకు తప్పకుండా ఆఫీసు కొచ్చెయ్. నేను వెడుతున్నాను. నిన్ను మీ ఇంటి దగ్గర సురక్షితంగా దింపడానికి ఇప్పుడే మనిషిని పంపుతాను. వస్తా" అంటూ కృష్ణమూర్తి గబగబా క్రిందకి వొచ్చేశాడు!

తనను గురించి ఎంతో ముచ్చటపడిన కృష్ణమూర్తి దేనికిఅలా మారి ఎందుకంత తొందరగా వెళ్ళిపోతున్నాడు?

తనేమైనా తప్పు చేసిందా!

ఈ వుద్యోగం తనకు వస్తుందా?

రాకపోతే ఏం చెయ్యాలి?

ఏం చెయ్యాలో, ఎలా నడుచుకోవాలో తెలియక తల డిల్లిపోయింది!

అప్రయత్నంగా మంజుల కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి!


ఆ కన్నీటి పొరలలోంచి చూస్తే, క్రిందికి దిగి కారు దగ్గరకు వెడుతున్న కృష్ణమూర్తి కనిపిస్తున్నాడు. ●




వెలువడింది!
రంగనాయకమ్మ రచన:
"నాస్తిక వాదం
హేతువాదం
నవ్యమానవ వాదం"
పేజీలు : 93 ధర : 3-50
ప్రతులకు :
అరుణా పబ్లిషింగ్ హౌస్,
ఏలూరు రోడ్, విజయవాడ-2.




ఉచితం ఉచితం ఉచితం
తెల్ల మచ్చలు
ఏ రకం తెల్లమచ్చలనైనా సరే వాని రంగు మరియు ఎర్రమచ్చలరంగు మా ప్రఖ్యాత ఔషధం "డాగ్ వినాశక్" వాడిన మొదల మూడు దినములలో మారును అటుపైన మామూలు చర్మంవలె నుండి పోవును ప్రచారం కొరకు ఒక సీసా మందు ఉచితంగా పంపెదము. వెంటనే వ్రాయండి.
Address
GAUTAM CHIKITSALAYA (S-DD)
(P.O.) KATRI SARAI (GAYA)


## అగ్నిహోత్రుడు

అగ్నిమాపక దళాధికారిగా చేరడానికి పరీక్షకు తెగ చదువుతున్నారు అగ్నిహోత్రుడుగారు. ఆయనకు ఆ రోజు సమీపిస్తున్నకొద్దీ దడ, ఒణుకు, కంగారు ఎక్కువయాయి. రాతపరీక్ష, నోటిపరీక్ష అయాక యిక ఇంటర్వ్యూ మాత్రం మిగిలింది. సిగరెట్ ఓటి ముట్టించి దమ్ముకి గట్టిగా పీల్చి



పొగవదిలారు కాస టెన్షన్ తగ్గించుకుందామని. ఇంతలో ప్యూన్ హఠాత్తుగా అతని పేరు "అగ్నిహోత్రుడుగారూ" అంటూ పిలవడంతో కంగారుపడిపోయి వెలిగించిన సిగరెట్‌ను జోబీలో పెట్టుకుని పొగలు చిమ్ముతూ అగ్నిమాపకదళ అధినేత గదిలోకి దృఢమైన ఆత్మవిశ్వాసంతో అడుగు పెట్టాడు.

★

## పెద్ద నిర్వచనం

పెద్దమనిషి : ఇరుచివరలా పెరగటం మాని మధ్యలో పెరగటం మొదలెట్టినవాడు.

★

## బంగారం బరువు

భర్త : ప్రియమైన భార్యామణీ నువ్వు లావౌతున్నావని చెప్పడానికి విచారిస్తున్నాను.

భార్య : అదేంపాపం! అప్పుడు మీరు అదృష్టవంతులేగదా నా ఒళ్ళంతా బంగారమే నని మీరేగా ఒకసారన్నారూ?